క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన చర్చిలు, ఇళ్లు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఊపందుకున్న వ్యాపారాలు
- క్రిస్మస్ క్యారల్స్‌తో సందడి



క్రిస్మస్‌కు ముస్తాబైన వైరా ఆర్‌సీఎం చర్చి



వైరాలో ఏర్పాటు చేసిన పశువుల పాక




మధిర: విద్యుత్ లైట్లతో అలంకరించిన చర్చి



తల్లాడ: ముస్తాబైన లూర్థుమాతా చర్చి

వైరా/మధిర: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలాల్లోని పలు చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. సోమవారం నిర్వహించే యేసుక్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించగా.. యేసు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించేలా పశువుల పాకలు ఏర్పాటు చేశారు. అలాగే, క్రైస్తవులు



వైరాలో అందంగా అలంకరించిన పశువుల పాక

తమ నివాస గృహాలపై విద్యుత్ లైట్లతో క్రిస్మస్ నక్షత్రాన్ని ఏర్పాటు చేయడంతో కొత్త కాంతి కనిపిస్తోంది. సేవే క్రీస్తు మార్గమని, ప్రేమ యేసు తత్వమని పలువురు క్రైస్తవ మత గురువులు బోధిస్తున్నారు.

ఊపందుకున్న వ్యాపారాలు...

క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవ సోదరులు సిద్ధమవుతుండగా వ్యాపారాలు ఊపందుకున్నాయి. స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, బెలూన్స్, బెల్స్ తదితర దుకాణాలు రద్దీగా ఉంటున్నాయి. వస్త్ర దుకాణాల్లో కూడా పండుగ రద్దీ నెలకొంది. ఇప్పటికే పలు క్రీస్తు జన్మదినం కోసం క్రైస్తవ సోదరులు ఎదురుచూస్తున్నారు.

ప్రత్యేక అలంకరణ..

క్రిస్మస్ పండుగకు ముందు క్రైస్తవ సోదరులు ఎదురు చూసే క్రిస్మస్ తాత కూడా ప్రత్యేక ఆకర్షణగా నిల్వనున్నాడు. క్రిస్మస్ తాత వేషధారణలో



తల్లాడ: లూర్థుమాతా ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

(శాంతాక్లాజ్) చేసే సందడి అంతాఇంతా కాదు. చిన్నారుల నుంచి పెద్దలు సైతం ఎంతో ఉత్సాహంగా క్రిస్మస్ తాతను చూసేందుకు ఆసక్తి కనబరుస్తారు. క్రిస్మస్ తాతకు శుభాకాంక్షలు తెలుపుతూ బహుమతులు అందుకుంటారు.

ప్రశాంతతకు నిలయం.. లూర్ధుమాతా ఆలయం

- జాతీయ రహదారి పక్కనే అతిపెద్ద చర్చి
- క్రిస్మస్‌తో నూతన శోభను సంతరించుకున్న ఆలయం

తల్లాడ: తల్లాడ పంచాయతీ పరిధిలోని నారాయణపురం లూర్థుమాతా ఆలయం అద్భుత ఆలయంగా.. ప్రశాంతతకు నిలయంగా ఉంటుందని ఆలయ విచారణ గురువు అజయ్ తెలిపారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ చర్చి జిల్లాలోనే అతిపెద్ద చర్చిగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. క్రిస్మస్ సమీపిస్తున్న కొద్దీ ఇక్కడ సందర్శకుల సంఖ్య పెరుగుతుంటుంది. ఎత్తైన చర్చి, లూర్థుమాతా విగ్రహాలు ఎంతో మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి.



ఫాదర్ అజయ్

ఆలయ విశిష్టత ..

24 సంవత్సరాల క్రితం రోమన్ కేథలిక్ మిషన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన ఈ చర్చిని నిర్మించారు. అప్పటినుంచి నేటివరకు చెక్కు చెదరకుండా అంతే ఉంది. ఈ ఆలయంలో అద్భుతమైన కల్వరి కొండలు, ఏసుక్రీస్తు జీవితానికి సంబంధించిన విశేషాలు, లూర్థుమాతా చిత్రపటాలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. చర్చిలోపల ఒకే సారి 3వేల మంది ప్రార్థనలు చేసేవిధంగా హాల్, బాల్కనీ ఉంది. చర్చిగోపురం 150 అడుగుల ఎత్తులో ఉంటుంది.

ఆలయంపైన ఉన్న గంట ప్రతిరోజు తెల్లవారు జామున మోగించినప్పుడు కిలో మీటరు దూరంలో చుట్టు పక్కల గ్రామాలకు వినపడుతుండటం విశేషం. ముఖ ద్వారం కూడా ఎంతో అందంగా రూపొందించారు.

క్లుప్తంగా

యువజనోత్సవాల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన బాలికలతో ఉపాధ్యాయులు

వైరా: ఈ నెల 22న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన 27వ జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో వైరాలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయం, కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. జానపద నృత్యంలో పాఠశాల విద్యార్థిని మార్తమ్మ, సింధూజలు ప్రథమ బహుమతి, జానపద గేయాల విభాగంలో వైష్ణవి ప్రథమ, సింధూజ ద్వితీయ, హస్తకళల విభాగంలో కుమారి, నిహారిక ద్వితీయ, ఫొటోగ్రఫీ విభాగంలో సోనూ శృతి ప్రథమ, అనుష్క ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరంతా 2024 జనవరి 12న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలికలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఎన్డీ నాయకుడు మృతి



కోటేశ్వరరావు

కొణిజర్ల: కొణిజర్ల మండల సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు ముత్తనబోయిన కోటేశ్వరరావు (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన మరణవార్త తెలుసుకున్న ఎన్డీ రాష్ట్ర నాయకుడు పి.నాగన్న.. కోటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ మోత్కూరి తిరుమలరావు, ఎన్డీ జిల్లా నాయకులు షేక్ ఖాసీమ్, ప్రజాపంథా జిల్లా నాయకులు కె.అర్జునరావు, లాల్‌మియా, సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతా సుధాకర్, స్వర్ణ సుబ్బారావు తదితరులు నివాళులు అర్పించారు.

ప్రెస్‌క్లబ్ సంతాపం..

కోటేశ్వరరావు పెద్దకుమారుడు ముత్తనబోయిన శ్రీనివాసరావు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తుండగా కొణిజర్ల మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు కోటేశ్వరరావు మృతి దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

క్రైస్తవులకు దుస్తులు పంపిణీ



కల్లూరు: క్రిస్మస్ దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



ఎర్రుపాలెం: క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ఉషాశారద



చింతకానిలో.. ఎంపీపీ కోపూరి పూర్ణయ్య

కల్లూరు/వేంసూరు/తల్లాడ: మండల కేంద్రాల్లో క్రైస్తవులకు ప్రభుత్వం అందజేస్తున్న దుస్తులను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రగమయి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేంసూరు మండలంలో, కల్లూరులోని సెయింట్ మైఖేల్స్ హైస్కూల్‌లో, తల్లాడ రైతువేదికలో నిరుపేద క్రైస్తవులకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం క్రైస్తవులకు దుస్తులను అందజేస్తుందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలుచేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలుచేసే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరోనా కొత్త వెరియంట్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ప్రతి ఒక్కరు మాస్క్, శానిటైజర్ వాడటంతో పాటు వ్యక్తుల మధ్య భౌతిక దూరం పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయనంద్ విజయ్ కుమార్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, నరసింహరావు, తహసీల్దార్ సాంబశివుడు, టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు విషప్ ఎండీ సుదర్శనం, బైబిల్ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు చందర్‌రావు, మోహన్‌రావు, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, ఎస్సీసీ నాయకులు సత్యానందం, సత్యంబాబు, మోహన్ నాయక్, ఉస్మాన్, ప్రభాకర్‌రావు, రమేష్, తల్లాడ సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మధిర నియోజకవర్గంలో..

ఎర్రుపాలెం/చింతకాని: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం అందిస్తున్న 200 గిఫ్ట్ ప్యాకెట్లను (దుస్తులను) పేద క్రైస్తవులకు తహసీల్దార్ ఉషాశారద, ఎంపీపీ దేవరకొండ శిరీష పంపిణీ చేశారు. ఈ గిఫ్టులను గ్రామాల్లోని చర్చి ఫాదర్లకు అందించారు. క్రైస్తవుల విందు నిర్వహణకు గానూ రూ.38 వేల చెక్కు అందించారు. అదే విధంగా చింతకాని మండల కేంద్రంలో క్రిస్మస్ కానుకలను ఎంపీపీ కోపూరి పూర్ణయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులందరూ సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమాలల్లో తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ వీరభద్రనాయక్, కాంగ్రెస్ నాయకులు కిలారు మనోహర్, గ్రామ ఉప సర్పంచ్ అనీల్‌కుమార్, చర్చి ఫాదర్ల మండల కమిటీ అధ్యక్షులు ఆదాం ఎలీషా, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వైరా: లిటిల్‌ఫ్లవర్స్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



కొణిజర్ల: పల్లిపాడు కార్తీక్ విద్యాలయంలో..

వైరా/కొణిజర్ల: వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్‌ఫ్లవర్స్ పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు కేక్ కట్ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పశువుల పాక, చిన్నారుల శాంతాక్లాజ్ వేషధారణలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా కొణిజర్లలోని పల్లిపాడు కార్తీక్ విద్యాలయంలో.. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నల్లబోలు మాధవరెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ శాంతి, సంతోషం, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యు, ఏఓ నరసింహారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి



ఎర్రుపాలెం: జమలాపురం ఆలయంలో బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్) ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న స్వామివారు

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను శనివారం పలు దేవాలయాల్లో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఖానస సంప్రదాయం ప్రకారం భక్తులు వేకువజామునే తలస్నానాలు ఆచరించి ఆలయాల్లో ఉత్తరద్వారం గుండా స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివార్లను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలుచోట్ల టీటీడీ భజన బృంద సభ్యులు భక్తిగీతాలను ఆలపిస్తూ భజనలు, కోలాట నృత్యాలు చేశారు. అర్చకులు వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం ద్వారా పూజలు చేసుకుంటే కలిగే మోక్షాన్ని భక్తులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



వైరా: కోదండ రామాలయంలో..



వైరారూరల్: కొండకొడిమ రామాలయంలో.. పూజలు చేస్తున్న దృశ్యం



కొణిజర్ల: కోదండ రామాలయంలో..



ముదిగొండ: ముత్తారం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనమిచ్చిన సీతారామచంద్రస్వామి



చింతకాని: సీతారామచంద్ర స్వామి ఊరేగింపులో భక్తులు



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో విష్ణుమూర్తి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



తల్లాడ: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

నర్సరీలను తనిఖీ చేసిన ఎంపీడీఓ



చిలుకూరు నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

మధిర: మండలంలోని చిలుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలను ఎంపీడీఓ షేక్.సిలార్ సాహెబ్ శనివారం తనిఖీ చేశారు. అలాగే, ఆయా గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. నర్సరీ, పల్లె ప్రకృతివనాల్లో గడ్డి తొలగించాలని, రానున్న వేసవికాలం దష్ట్యా ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోస్తూ సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న దృశ్యం

మధిర: మండలంలోని మడుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నాలుగో శనివారం సందర్భంగా 'నో బ్యాగ్ డే'నిర్వహించారు. ఈ మేరకు పలువురి విద్యార్థులకు హెచ్‌ఎం సీహెచ్.సాధు సమాధానం రక్తపరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చి కిట్లు అందించారు. దీంతో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎస్.రమ్య, ఎం.ప్రగతి, ఎస్.హేమలత, టి.మనీషా పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి బ్లడ్ గ్రూప్ తెలియజేశారు. అనంతరం రక్తదానం ఆవశ్యకత, లాభాలను హెచ్‌ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట నర్సింహారావు, బూసా కోటేశ్వరరావు, పైడిపల్లి కిషోర్, జె.ఝహోషువ, టి.జ్యోతిర్మయి, బి.చైతన్య, బి.రాణి, సీహెచ్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఎంఎల్ పార్టీలు విలీనం



మాట్లాడుతున్న ఝాన్సీ

కారేపల్లి: బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రివెల్యూషనరీ ఇన్షియేటివ్ మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు విలీనమవుతున్నాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ తెలిపారు. శనివారం మండలంలోని టేకులగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజాపంథా సంయుక్త మండలాల కమిటీ సమవేశంలో ఆమె మాట్లాడారు. భారత విప్లవోద్యమం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. 2024 మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మంలో జరిగే కమ్యూనిస్టు పార్టీల ఐక్యతా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మడి సందీప్, రాకేష్, తేజనాయక్, భాస్కర్, పాపారావు, వీరన్న, అనసూర్య, సరోజిని, రంగ్యా, రాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.